క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

పాన్‌గల్: భగవద్గీత చదివితే జ్ఞానం పెరుగుతుందని త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక వనపర్తి కమిటీ అధ్యక్షులు వెంకట్రాములు అన్నారు. సోమవారం మండలంలోని అన్నారంతండాలో యోగి ప్రబోధనంద యోగపీఠం స్థాపించిన ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర స్వామి వారు రచించినటు వంటి 100 ఆధ్యాత్మిక రచనలను 'త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హోలీ పూర్ణిమ పండుగపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సురేష్‌కుమార్, బద్రీనాథ్, పద్మ, స్వరూప, అలివేలు, సుదర్శన్‌రెడ్డి, నాగరత్నం, లలిత, శివమ్మ, సాత్విక్, అమ్ములు పాల్గొన్నారు.

మొక్కలు ఎండకుండా చూడాలి

వనపర్తి రూరల్: మండలంలోని పెద్దగూడెం గ్రామంలోని నర్సరీలో పెంచుతున్న మొక్కలను సోమవారం ఎంపీడీఓ రాఘవ పరిశీలించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా రోజుకు రెండు పూటల నీరందించాలని, నర్సరీ జర్మినేషన్ సక్రమంగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్‌కు సూచించారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



పాన్‌గల్: గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ.జబ్బార్ అన్నారు. సోమవారం మండలంలోని రేమద్దుల గ్రామంలో సమస్యలపై నిర్వహిస్తున్న సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 13 నెలలైనా గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించలేదన్నారు. పార్టీ నాయకులు గుంటివెంకటయ్య, భగత్, ఎం.వెంకటయ్య, ఖాజా, భాస్కర్, నిరంజన్, శేఖరయ్య, బాలకృష్ణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

స్టార్‌ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఇఫ్తార్

ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు సోమవారం రాత్రి స్థానిక మదర్సా ఇమాదుల్‌ఉలూం మజీద్‌లో స్టార్‌ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రహ్మతుల్లా, మహ్మద్ రఫీ, ఆటోమొబైల్ ఇస్మాయిల్, ఫేరోజ్, కరెంట్ ఇస్మాయిల్, సన సాధిఖ్, మార్బుల్‌సాధిఖ్, ఖాదర్, జమాల్, ఫేరోజ్, అఫ్రోజ్, నయ్యూం, హమీద్, హనీఫ్, ఖుద్దూస్ పాల్గొన్నారు.

ఆరెకటికల సభను విజయవంతం చేయండి

చిన్నంబావి: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మంగళవారం నిర్వహించే ఆరెకటిక సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మోజీ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరెకటికలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, ఆరెకటికల ఫెడరేషన్ రూ. 500కోట్లు కేటాయించాలని కోరారు. అనంతరం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కొత్తకోట రూరల్: తెలంగాణ గురుకుల పాఠశాలలో పనిచేసే అవుట్ సోర్సింగ్, స్విపింగ్ అండ్ శానిటైజేషన్ వర్కర్లకు నాలుగు నెలల వేతనాలు ఇవ్వడం లేదని బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మహబూబ్‌నగర్ జోనల్ ప్రాంతీయ కార్యాలయంలో ఇన్‌చార్జి అధికారి సులోచనను కలిసి వనతిపత్రం అందజేసినట్లు బీఎస్పీ ఇన్‌చార్జి వినోద్‌కుమార్ తెలిపారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వకుంటే కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమంలో కురుపమ్మ, అనురాధ, బాబు ఉన్నారు.

తండాలో సమస్యలు పరిష్కరించండి

అమరచింత: చంద్రనాయక్ తండా గ్రామ పంచాయతీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకుడు ఆర్ఎన్.రమేష్ మాట్లాడుతూ చంద్రనాయక్ తండాకు సంబంధించిన నక్షబాట రహదారిని నేటికీ నిర్మించక పోవడం వింతగా ఉందన్నారు. పంచాయతీ పరిధిలోని మూడు తండాలలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్లయినా జీపీకి సొంత భవనం లేకపోవడం శోచనీయమన్నారు. సీపీఎం నాయకులు వెంకటేష్ నాయక్, ఫుల్యానాయక్, హరియా నాయక్, హన్మంతు నాయక్ పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో అభివృద్ధి



చిమనగుంటపల్లిలో పూర్తయిన సీసీ రోడ్డు

- మండలంలో రూ.2.15కోట్లతో సీసీరోడ్లు
- గ్రామ పంచాయతీల ద్వారా నిర్మాణం
- మార్చి నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు

వనపర్తి రూరల్: గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వనపర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించేందుకు మండలానికి రూ. 2.15 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొత్తం నిధులతో మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. జనవరిలో నిధులు మంజూరు కాగా, గ్రామ పంచాయతీల ద్వారా పనులు చేపట్టారు. ఇప్పటికే 5 గ్రామ పంచాయతీలు రాజపేట, చిమన్నగుంటపల్లి, కడుకుంట్ల, పెద్దగూడెం, చందాపురం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయ్యాయి. మిగతా గ్రామాల్లో రోడ్ల నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రోడ్లు మంజూరు చేయడం వల్ల గ్రామాల్లో అత్యవసరమైన చోట్ల రోడ్ల నిర్మాణం ప్రారంభించామని ప్రత్యేక అధికారులు చెబుతున్నారు. ఈ నిర్మాణ పనులు త్వరగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని అధికారులు సూచిస్తున్నారు. గ్రామాల్లో చేపడుతున్న సీసీరోడ్లు నాణ్యతగా చేపట్టాలని, మొదట అత్యవసరం ఉన్నచోట నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

> **రోడ్ల నిర్మాణానికి చర్యలు..**
>
> ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామ పంచాయతీల్లో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణం పనులు ప్రారంభించాం. 5 గ్రామ పంచాయతీలలో పనులు పూర్తయ్యాయి. మిగతా కోట పనులు నడుస్తున్నాయి. మార్చి 31 వరకు పూర్తి చేయాల్సి ఉంది. సాధ్యమైనంత త్వరగా రోడ్ల నిర్మాణం చేపట్టాలి. సకాలంలో పనులు పూర్తి చేస్తే ఎంబీ రికార్డు చేసి బిల్లులు త్వరగా పొందే అవకాశం ఉ ంటుంది.
>
> – భాస్కర్, పీఆర్ఏఈ, వనపర్తి



కొనసాగుతున్న సీసీరోడ్డు పనులు

సావిత్రీబాయి జీవితం ఆదర్శం



సీపీఐ కార్యాలయంలో సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



చిట్యాలలో సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సాక్షి, నెట్‌వర్క్: వనపర్తి మండలంలోని చిట్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సావిత్రీబాయి పూలే వర్ధంతిని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మహిళా నాయకురాలు కళావతమ్మ, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, పలువురి మహిళలతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- సమాజంలో మహిళల విద్య వ్యాప్తి కోసం అలుపెరుగని పోరాటం చేసిన తొలి ఉపాధ్యాయురాలు గొప్ప సంఘ సంస్కర్త, బీసీల ఆరాధ్య దైవం సావిత్రీబాయి పూలే జీవితం నేటితరం మహిళలకు ఆదర్శమని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు సతీష్‌యాదవ్ అన్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సతీష్‌యాదవ్ మాట్లాడుతూ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, ఆడబిడ్డలకు విద్యా ప్రదాత సావిత్రీబాయి పూలే అని అన్నారు.
- భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే సేవలు మరువలేనివని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఖిల్లాఘనపురం మండల కేంద్రంలోని బస్టాండు దగ్గర సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో దీర్ఘాయువు, రాములు, నరేందర్, కటికే తానాజీ, ఆటో డ్రైవర్లు, యువకులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యం తెలుసుకునేందుకే సర్వే



గోపాల్‌పేట: రెండో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ రామమూర్తి అన్నారు. సోమవారం, మంగళవారం, బుధవారం సర్వే ఉంటుందని తెలిపారు. సోమవారం కేశంపేట కొత్తతండా, గొల్లపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ప్రతిభను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. మంగళవారం, బుధవారం సైతం మండలంలోని ఆయా పాఠశాలల్లో సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సీనియర్ సివిల్ కోర్టు న్యాయవాదిగా కృష్ణ

కొత్తకోట రూరల్: వనపర్తి సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసిస్టెంట్ న్యాయవాదిగా మునగారి కృష్ణయ్య(మునగారి కృష్ణ)ను నియమించినట్లు ఈ మేరకు నియామకపత్రాన్ని మునగారి కృష్ణ అందుకున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని వడ్డెవాట గ్రామానికి చెందిన మునగారి కృష్ణ గత కొన్నేళ్లుగా వనపర్తి సీనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు కావడంతో పాటు యువకుడు, న్యాయవాద వృత్తిలో చురుకుగా పనిచేస్తుండటంతో ఎమ్మెల్యే, సీఎం రేవంత్‌రెడ్డి మునగారి కృష్ణకు సముచిత గౌరవం ఇచ్చినట్లు సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోయేజ్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

ఆత్మకూర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దళిత యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉమ్మడి ఆత్మకూర్ మండల శిక్షణ తరగతులు ఈ నెల 11, 12 వతేదీల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం నిర్వాహకులు నడిపి నర్సింహులు, కురుమూర్తి, తదితరులు కరపత్రాలు విడుదల చేశారు. ఉమ్మడి మండలంలోని యువత పెద్ద ఎత్తున శిక్షణ తరగతులకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేజీబీవీ వర్కర్లకు జీతాలు ఇవ్వాలి



వనపర్తిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కేజీబీవీ వర్కర్లు

వనపర్తి రూరల్: ఎస్ఎస్ఏ ఉద్యోగులు సమ్మె చేసిన కాలంలో కేజీబీవీ వర్కర్స్‌తో 27 రోజులు పని చేయించుకుని జీతాలు ఇవ్వకపోవడం సరైంది కాదని, వారికి వెంటనే జీతాలు ఇవ్వాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (టీయూసీఐ) రాష్ట్ర ఉపాధ్యక్షులు పి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హాస్టల్లో వర్కర్స్ పని చేసిన విషయం తెలిసి కూడా జిల్లా, మండల అధికారులు సందర్శించినప్పుడు వర్కర్లు పని చేస్తున్న విషయం గ్రహించినా, తర్వాత కూడా వర్కర్స్‌కు సంతకాలు చేసే రికార్డు ఇవ్వలేదు. ఆ టైంలో చర్యలు తీసుకోకుండా ఇప్పుడు వర్కర్లకు జీతాలు ఇవ్వాలని కోరితే రికార్స్‌లో సంతకాలు చేయలేదని చెప్పడం దాటవేసే విధానమే కాని మరొకటి కాదన్నారు. ఉమ్మడి జిల్లాలో నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాలో వర్కర్లకు సమ్మె కాలం జీతాలు వచ్చాయి. ఇక్కడ మాత్రం అధికారుల నిర్లక్ష్యం వల్ల వర్కర్లకు జీతాలు రాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వర్కర్లందరికి జీతాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (టీయూసీఐ) జిల్లా కార్యదర్శి గణేష్, వర్కర్లు చిట్టెమ్మ, రేణుక, బాలనాగమ్మ, సాదికబీ, తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరస్వామి ఉత్సవాలు

- స్వామివారికి భక్తుల దాసంగాలు



స్వామివారి మూలవిరాట్



స్వామివారికి దాసంగాలు పెడుతున్న భక్తులు

ఆత్మకూర్: ఆత్మకూర్ పట్టణంలోని చెరువు మధ్యలో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాదిమంది భక్తులు బక్షాలు, పచ్చిపులుసు, అన్నంతో స్వామివారికి నైవేద్యం సమర్పించి దాసంగాలు పెట్టారు. అనంతరం ప్రముఖ పూజారి కర్పసయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోలీ పండుగ వరకు ఉత్సవాలు కొనసాగుతాయని, భక్తులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతోనే..

30 ఏళ్ల చరిత్రలో మొదటిసారిగా మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో జాతర ఉత్సవాలు కనివిని ఎరుగని రీతిలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో కృతజ్ఞత సమావేశంలో నిర్వాహకులు వీఎస్ రాబు, సాయిరాఘవ, మణివర్ధన్‌రెడ్డి, యాదగిరిశెట్టి, తెలుగు నాగేష్‌లు మాట్లాడారు. ఎమ్మెల్యే సహకారంతో మొదటిసారి చెరువులో రెండు బోట్లు నడిపించారని పెద్దలు, మహిళలు, పిల్లలు సరదాగా చెరువులో పడవ శికారు చేశారన్నారు. ఉత్సవాలకు ఆర్థికంగా సహకారం అందించిన వారితో పాటు భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, గంగాధర్‌గౌడ్, రవికాంత్, నాగేష్, పరమేష్, తులసీరాజ్, శ్రీను, దామోదర్, మహేష్, గాలిపంపు శ్రీను, తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్ క్రీడాకారిణికి ఉత్తమ పురస్కారం



ఆత్మకూర్: ఆత్మకూర్‌కు చెందిన క్రీడాకారిణి సమీనాబేగం జిల్లా ఉత్తమ క్రీడాకారిణిగా ఎంపికైంది. వాలీబాల్ క్రీడలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తచాటింది. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఆదర్శ్ సురభీ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ క్రీడాకారినిగా ప్రశంసాపత్రం, షీల్డును అందుకుంది.

ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన

వనపర్తిటౌన్: ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ చట్టం అమలు తర్వాతే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, ఉద్యోగ ఫలితాలు, నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని మర్రికుంట ధర్నాచౌక్‌లో ఎమ్మార్పీఎస్ వనపర్తి మండల అధ్యక్షుడు తిరుపతి అధ్యక్షతన నిరసన చేపట్టారు. వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయకుండానే ఉద్యోగ నియామకాలు చేపట్టడం ఏంటని మండిపడ్డారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



కొత్తకోట పోలీస్‌స్టేషన్ నుంచి ఇంటర్ పరీక్ష ప్రశ్నపత్రాలను తీసుకెళ్తున్న అధికారులతో డీఐఈఓ ఎర్ర అంజయ్య

కొత్తకోట రూరల్: ఇంటర్ పరీక్షలు ఐదో రోజు ప్రశాంతంగా కొనసాగాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 176 మంది విద్యార్థులకు గాను 172మంది, నివేదిత జూనియర్ కళాశాలలో 218మంది విద్యార్థులకు గాను, 210మంది, అదేవిధంగా ప్రతిభ జూనియర్ కళాశాలలో 210మంది విద్యార్థులకు గాను, 204మంది పరీక్షలు రాసినట్లు డీఐఈఓ ఎర్ర అంజయ్య, కస్టోడియన్ అధికారి విశ్వేశ్వర్‌లు తెలిపారు. డీఐఈఓ పట్టణ కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. సీఎస్, డీఓలకు తగు సూచనలు చేశారు. అంతకు ముందు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇంటర్ ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు సంబంధిత అధికారులు ఏవిధంగా తీసుకెళ్తున్నారో పరిశీలించారు. పరీక్షల సమయంలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఇంటర్ పరీక్షలో ఇద్దరు గైర్హాజరు

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలో సోమవారం ద్వితీయ సంవత్సరంలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు చీఫ్ సూపరింటెండెంట్ సుదర్శన్‌రెడ్డి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ వెంకటేష్ తెలిపారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 108 మంది విద్యార్థులకు గాను ఇద్దరు విద్యార్థులు గైర్హాజర్ అయినట్లు వారు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాన్ని సిటింగ్ స్క్వాడ్ నర్సింహ సందర్శించారు.

ఆత్మకూర్: ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అంజయ్య అన్నారు. సోమవారం ఆత్మకూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, వికాస్ కళాశాల పరీక్ష సెంటర్లను పరిశీలించారు. ఎక్సామినేషన్ సూపర్ వైజర్లు భాగ్యవర్ధన్‌రెడ్డి, టీజే విశ్వేశ్వర్, మహేందర్, శాంతిరెడ్డి, రాములు ఆయన వెంట ఉన్నారు. సెంటర్లలో విద్యార్థులకు పూర్తి సౌకర్యాలు కల్పించామని తెలిపారు.

వడదెబ్బ నివారణకు అవగాహన కల్పించాలి



వడదెబ్బ నివారణపై చైతన్యం చేసే వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పీహెచ్‌సీ డాక్టర్, సిబ్బంది

పాన్‌గల్: వడదెబ్బ నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వడదెబ్బ నివారణపై వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తీవ్రమైన ఎండల కారణంగా అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్ల కూడదని, మధ్యాహ్నం 11 గంటల నుంచి 3 గంటల సమయంలో బయటకు రావొద్దని, తప్పని పరిస్థితులలో బయటకి వెళ్లాల్సి వస్తే తలకు తలపాగా లేదా గొడుగు వాడాలని, తెలిక పాటి దుస్తులు ధరించాలని, తగినంత నీరు తాగాలని ప్రజలను చైతన్యం చేయాలన్నారు. విద్యార్థులు ఎండల సమయంలో బయటకు వెళ్లకుండా, ఆటలు ఆడకుండా జాగ్రత్తలు తీసుకునేలా ఉపాధ్యాయులకు సూచించాలన్నారు. వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నత్తనడకన హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణ పనులు



మస్తీపురంలో నిర్మాణంలో ఉన్న హెల్త్ సబ్‌సెంటర్

అమరచింత: మండలంలోని మస్తీపురం గ్రామంలో నిర్మిస్తున్న హెల్త్ సబ్‌సెంటర్ నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. రూ.20 లక్షలతో చేపడుతున్న హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశించినా సదరు కాంట్రాక్టర్ పనులు నత్తనడకన కొనసాగిస్తున్నారు. హెల్త్ సబ్‌సెంటర్ లేక పోవడంతో ఆరోగ్యశాఖకు చెందిన ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు గ్రామ పంచాయతీ భవనంలో ఇది వరకు విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీ భవనం కూల్చివేసి నూతన భవనం నిర్మిస్తుండటంతో విధుల నిర్వహణకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అధికారులు స్పందించి త్వరగా భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఎట్టకేలకు సీసీరోడ్డు పనులకు మోక్షం



మస్తీపురంలో సీసీకి నోచుకోని ప్రధాన రహదారి

అమరచింత: మస్తీపురం ఎక్స్‌రోడ్ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వరకు బీటీ రహదారి పనులు పూర్తయి ఏడాదిన్నర కాలం దాటుతున్నా మస్తీపురం మీదుగా నిర్మించే సీసీ పనులు మాత్రం పూర్తి కాలేదు. దీంతో ప్రయాణికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మస్తీపురం గ్రామ శివారు నుంచి 500 వందల మీటర్ల మేరకు బీటీకి బదులుగా సీసీ రహదారి నిర్మించాలని ప్రతిపాదనలు ఉండటంతో ఎట్టకేలకు సీసీ రహదారి పనులను మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం భూమిపూజతో పనులు ప్రారంభించనున్నారు. 500 మీటర్ల సీసీ రహదారి పనులకు రూ.75 లక్షలు మంజూరైనట్లు పంచాయతీ రాజ్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం పంట కోతల కాలం పూర్తికావడంతో సీసీ రహదారి పనులను చేపడుతున్నామని వెల్లడించారు. త్వరితంగా సీసీ రహదారి పనులు పూర్తి చేసి ప్రయాణికులతో పాటు పర్యాటకుల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వనపర్తి విద్యావిభాగం: త్వరలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) వనపర్తి జిల్లా అధ్యక్షులు ఆది ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసే విధంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అసెంబ్లీలో లేవనెత్తాలని పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అదేవిధంగా వనపర్తి జిల్లా కేంద్రంలో బీసీ బాలుర కళాశాల వసతి గృహానికి, ఎస్సీ కళాశాల బాలికల హాస్టల్స్ (పీర్లగుట్ట), (కేడీఆర్)లో ఉన్న వాటికి సొంత భవనాలు, కేడీఆర్‌లో ఉన్న ఎస్సీ(ఏ) బాలుర హాస్టల్‌కు, పెద్దమందడి బీసీ బాలుర హాస్టల్ కు సొంత భవనాలు నిర్మించి, రేవల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వీరన్న నాయక్, అంజనేయులు, మోహన్, రాజ వర్ధన్ తదితరులు ఉన్నారు.

కౌలు రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి



ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేవీఎన్‌పీఎస్ ప్రతినిధులు

కొత్తకోట రూరల్: ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.చక్రవర్తి డిమాండ్ చేశారు. పెద్దమందడి మండలం చిన్నమందడి గ్రామంలో జనవరి 23న ఆత్మహత్య చేసుకున్న కౌలురైతు యండీ. ఖాజాపాషా (41) కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాజాపాషా మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని పెట్టుబడి కోసం అప్పులు చేసి వ్యవసాయం చేశాడు. ఈ క్రమంలో నష్టాలు ఎక్కువ రావడంతో, సపోర్టుగా ఐదారు బర్రెలు తీసుకొని అప్పుచేసి పాడి పరిశ్రమ ఏర్పాటు చేశాడు. ఇలా మొత్తం అప్పులు రూ.10 లక్షలు కావడం అప్పులకు వడ్డీలు కట్టలేని స్థితి రావడం అప్పులు ఇచ్చినవాళ్లు వత్తిడి చేయగా, తట్టుకోలేక మానసికంగా కుంగిపోయి జనవరి 23న వ్యవసాయ పొలంలోనే చింత చెట్టుకు ఉరేసుకొని చనిపోయాడని గుర్తు చేశారు. ఖాజాపాషా ఆత్మహత్య చేసుకుని 45రోజులు గడిచినా ఇప్పటి వరకు ప్రభుత్వం తరపున ఎలాంటి సహాయ సహకారాలు అందలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఖాజాపాషా కౌలురైతు కావడం వల్లనే ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని, రైతు బీమా, రైతు భరోసాను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీఎన్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈరపాగ గోవిందు, రాష్ట్ర నాయకులు ఎర్ర మోహనకృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.